9న జాబ్‌మేళా

ప్రజాశక్తి-విజయనగరంకోట

వివిధ కంపెనీల్లో ఉద్యోగాల భర్తీ కోసం ఈనెల 9న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి డి.అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆల్ట్రాటెక్ కంపెనీలో టెక్నికల్, అప్లికేషన్ ఇంజనీర్స్-6, పేటిం కంపెనీలో ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్-100 ఉద్యోగాల భర్తీ జరుగుతుందని తెలిపారు. పురుష అభ్యర్థులు మాత్రమే ఈ ఉద్యోగాలకు అర్హులని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల్లో పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ పేర్లను ముందుగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఎన్‌సిఎస్.జిఒవి.ఇన్ వెబ్‌సైట్‌లోని జాబ్ సీకర్స్ లాగిన్‌లో నమోదు చేసుకొని, ఈనెల 9న ఉదయం 10 గంటలకు విజయనగరం బిసి కాలనీ సమీపంలోని ప్రభుత్వ ఐటిఐలో జరిగే ఇంటర్వ్యూకు, సంబంధిత సర్టిఫికేట్ కాపీలతో హాజరు కావాలని కోరారు. ఇతర వివరాల కోసం 8919378915 నంబరుకు సంప్రదించాలని అరుణ సూచించారు.

- ఏటా సాగునీటి రంగంపై నిర్లక్ష్యం
- పారిశ్రామికాభివృద్ధికి కానరాని కేటాయింపులు
- ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలను ఆదుకునేనా?
- నేడు రాష్ట్రబడ్జెట్

నిధులు కేటాయించేనా?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

రాష్ట్ర బడ్జెట్‌లో జిల్లా అభివృద్ధికి అనుగుణంగా ఈ సారైనా నిధులు కేటాయించేనా? లేక ఎప్పటి మాదిరిగానే నవరత్నాలనే గొప్పగా చెప్పుకుంటారా? ఇదీ జిల్లాలో ప్రస్తుతం సాగుతున్న చర్చ. అసెంబ్లీ సమావేశాల్లో 2024-25 రాష్ట్ర బడ్జెట్ బుధవారం ప్రవేశపెట్టనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు, విద్యాసంస్థలు, మెడికల్ కాలేజీ, ముఖ్యంగా జిల్లాలో చేపడతామన్న పారిశ్రామికాభివృద్ధిని చాలా మంది గుర్తు చేస్తున్నారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో 80శాతం ప్రజలు వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు. ఇందుకోసం తలపెట్టిన తోటపల్లి, రామతీర్థసాగర్ సాగునీటి ప్రాజెక్టులకు నిధుల కేటాయింపులో ప్రభుత్వం ఏటా నిర్లక్ష్యం చూపుతోంది. ఈ రెండు ప్రాజెక్టులకు వందల రూ.కోట్లు కేటాయించాల్సి వుండగా నాలుగో వంతు కూడా కేటాయించలేదు. 64వేల ఎకరాల సాగునీటిని స్థిరీకరిస్తూనే 1,31,221 ఎకరాలకు సాగునీరు అందించేందుకు తోటపల్లి ప్రాజెక్టు పనులకు రూ.294.90 కోట్లు, సిఎడిడబ్ల్యుఎం పనులకు రూ.107.69కోట్లు, భూసేకరణకు 46.38కోట్లు, ఆర్అండ్ఆర్ ప్యాకేజీకి రూ.107.06కోట్లు చొప్పున మొత్తం రూ.556.03కోట్లు కేటాయించాలని గత ఏడాది అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఆచరణలో కేవలం రూ.80.84కోట్లు మాత్రమే కేటాయించారు. ఇందులో ఖర్చు చేసింది కేవలం రూ.15కోట్లు లోపేనని సమాచారం. ప్రస్తుతం ఆర్థిక సంవత్సరంలో కేవలం పనుల నిమిత్తం రూ.242.17కోట్లు కేటాయించాలని అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఆచరణ ఎలా ఉంటుందో వేచిచూడాల్సివుంది. ఇప్పటికే నిధులు సరిపోక కాంట్రాక్టర్ పనులు నిలిపివేసిన పరిస్థితుల్లో తాజా కేటాయింపులు మరింత విస్మయానికి గురి చేస్తున్నాయి. పెండింగ్ పనుల వల్ల సుమారు 60వేల ఎకరాలకు సాగునీరు అందడం లేదు. తారకరామ తీర్థసాగర్ జలాశయం, కాలువల నిర్మాణ పనులకు మొత్తంగా రూ.535.18కోట్లు అవసరం కాగా, ఈ ఏడాది తక్కువలో తక్కువగా 399.18కోట్లు అవసరమౌతాయని ప్రతిపాదనలు పంపారు. ఈ రెండు ప్రాజెక్టులు తరువాత అత్యంత ప్రతిష్టాత్మకమైన జంఝావతికి ప్రభుత్వం అంతంతమాత్రంగానే నిధులు కేటాయిస్తోంది. మడ్డువలస, తాటిపూడి, ఆంధ్ర, పెద్దగెడ్డ, పెదంకలాం, డెంకాడ ఆనకట్టు, వట్టిగెడ్డ జలాశయాల రైతులు కూడా నీళ్ల, నిధుల కోసం ఎదురు చూస్తున్నారు. జెఎన్‌టియు గురజాడ వర్సిటీలో అదనపు భవనాలు వంటి మౌలిక వసతుల కల్పనకు నిధులు లేవు. గిరిజన వర్సిటీకి అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం కూడా నిధుల కేటాయింపులో వివక్ష చూపుతున్నాయి. అసలే ఈ రెండు జిల్లాలు పారిశ్రామికంగా వెనుకబడివున్నాయి. జ్యూట్ పరిశ్రమలు దాదాపు మూతపడ్డాయి.

ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు కొన ఊపిరితో నడుస్తున్నాయి. వీటిని ఆదుకునేందుకుగానీ, కొత్తపరిశ్రమల స్థాపనకుగానీ ఎలాంటి ప్రతిపాదనలు కూడా లేవు. బాక్సైట్ శుద్ధి కర్మాగారం కోసం 18ఏళ్ల క్రితం కేటాయించిన జిందాల్ కోసం సేకరించిన భూమిలో స్మాల్‌స్కేల్ ఇండస్ట్రీస్ ఏర్పాటు చేస్తామంటూ ఏడాది క్రితం జరిగిన రాష్ట్ర మంత్రి వర్గ సమావేశం నిర్ణయించినప్పటికీ ఆచరణకు నోచుకోలేదు. మరోవైపు సేవారంగంలోనే జిల్లాకు తగిన కేటాయింపులు లేవు. ఎయిర్‌పోర్టు నిర్వాసితులు ఇప్పటికీ అధికారుల చుట్టూ ప్రదక్షిణలను చేస్తున్నారు. కేవలం నిర్వాసితులకే సుమారు రూ.200కోట్ల మేర రావాల్సివుందని సమాచారం. ఇలా ఒకటి కాదు... రెండు కాదు.. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలు అన్ని రంగాల్లోనూ వెనుకబడి ఉన్నాయి. కేటాయింపులన్నీ నవరత్నాలు, జగనన్న, వైఎస్ఆర్ పేరిట ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల పద్దుల్లోనే కనిపిస్తున్నాయి. ఈనేపథ్యంలో ఈ రెండు జిల్లాల అభివృద్ధి కోణంలో నేడు జరగబోతున్న బడ్జెట్ సమావేశాన్ని భేరీజు వేస్తున్నారు.

పోస్టల్ బ్యాలెట్ చాలా కీలకం

చిన్న పొరపాటు కూడా జరగకూడదు • కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

ప్రస్తుత పరిస్థితుల్లో పోస్టల్ బ్యాలెట్లు ఎంతో కీలకమని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. పోస్టల్ బ్యాలెట్ల తయారీ, జారీ, స్వీకరణలో ఎక్కడా చిన్న పొరపాటు కూడా రాకూడదని స్పష్టం చేశారు. అన్ని దశల్లో ఎన్నికల కమిషన్ నిర్ధేశించిన నిబంధనలను తూచా తప్పకుండా పాటిస్తూ, పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పూర్తిచేయాలని సూచించారు. ఎన్నికల శిక్షణా కార్యక్రమాల్లో భాగంగా, పోస్టల్ బ్యాలెట్లకు సంబంధించిన అంశాలపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా స్థాయి శిక్షణా కార్యక్రమం జరిగింది. పోస్టల్ బ్యాలెట్లకు సంబంధించి జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనీలుగా ఎంపికైన డిఆర్‌డిఎ పీడీ ఎ.కల్యాణ చక్రవర్తి, జిల్లా బిసి సంక్షేమాధికారి కె.సందీప్ కుమార్ శిక్షణ ఇచ్చారు. పోస్టల్ బ్యాలెట్ పత్రాల తయారీ, ఓటింగ్, కౌంటింగ్, ఫెసిలిటేషన్ సెంటర్ సిబ్బంది నియామకం, ఇంటివద్దే ఓటింగ్ తదితర అంశాల గురించి వీరు వివరించారు.

కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ, గత ఎన్నికలతో పోలిస్తే, ప్రస్తుత ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్లు, ఓటింగ్, కౌంటింగ్ విధానాల్లో పలు మార్పులు వచ్చాయని చెప్పారు. ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాల్లో ఇవన్నీ స్పష్టంగా ఉన్నాయని, వీటిని పూర్తిగా అర్థం చేసుకోవాలని సూచించారు. గతంలో సర్వీసు ఓటర్లు, ఎన్నికల విధుల్లో ఉన్న వారికి మాత్రమే పోస్టల్ బ్యాలెట్లు జారీ చేసేవారని చెప్పారు. ప్రస్తుతం వీరితోపాటు ఆబ్సెంట్ ఓటర్ల విధానం కూడా కొత్తగా వచ్చిందని తెలిపారు. దీనిలో భాగంగా వయసు 80 సంవత్సరాలు దాటినవారు, 40 శాతం పైబడి వికలాంగత్వం ఉన్న విభిన్న ప్రతిభావంతులు, కోవిడ్ వ్యాధిగ్రస్తులు, అత్యవసర సర్వీసుల్లో ఉన్నవారు కూడా పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని వినియోగించుకొనే అవకాశం కల్పించారని తెలిపారు. వీరు పోస్టల్ బ్యాలెట్ కోసం ముందుగా దరఖాస్తు చేసుకుంటే, నిర్ధేశించిన ప్రక్రియ ప్రకారం వాటిని జారీ చేయాల్సి ఉంటుందన్నారు. వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు, కోవిడ్ వ్యాధిగ్రస్తులు తాము ఇంటివద్దనుంచే ఓటు వేస్తామని కోరితే, ఆ మేరకు ప్రత్యేక పోలింగ్ బృందాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు.

పోస్టల్ బ్యాలెట్లను లెక్కించేందుకు అవసరమైతే ప్రత్యేక కౌంటింగ్ కేంద్రాలను కూడా ఏర్పాటు చేయాలని చెప్పారు. సర్వీసు ఓటర్లకు మాత్రం ఆన్‌లైన్ ద్వారా బ్యాలెట్ పత్రం పంపబడుతుందని, వీరు ఓటు కోసం ప్రత్యేకంగా దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని చెప్పారు. వీరి బ్యాలెట్ పత్రాలపై అభ్యర్థుల పేర్లు, ఫొటోలు, పార్టీలు మాత్రమే ఉంటాయని, పార్టీ గుర్తులు మాత్రం ఉండవని వివరించారు. ప్రతీ బ్యాలెట్ పత్రంపైనా ఆఖర్లో నోటా తప్పనిసరిగా ఉంటుందని తెలిపారు. చిన్న పొరపాటు కూడా పెద్ద ప్రభావాన్ని చూపిస్తుందని, అందువల్ల ప్రతీఒక్కరూ అప్రమత్తంగా విధులను నిర్వర్తించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఆ మేరకు సిబ్బందికి శిక్షణ ఇచ్చి, వివిధ అంశాలపై సంపూర్ణ అవగాహన కల్పించాలని మాస్టర్ ట్రైనీలను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డిఆర్ఒ ఎస్‌డి అనిత, మెప్మా పీడీ సుధాకరరావు, ఎన్నికల విభాగం సూపరింటిండెంట్ ప్రభాకర్, మాస్టర్ ట్రైనీలు, వివిధ నియోజకవర్గాల నుంచి డిప్యూటీ తాహాశీల్దార్లు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు, ఉద్యోగులు

సమ్మె ఒప్పంద జీవోలు వెంటనే ఇవ్వాలి

కలెక్టరేట్ వద్ద మున్సిపల్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మున్సిపల్ కార్మికుల సమ్మె సందర్భంగా ప్రభుత్వం చేసుకున్న ఒప్పంద జీవోలను వెంటనే విడుదల చేయాలని, పంపు హౌస్ కార్మికుల్ని ఆప్కాస్ లో చేర్చాలని, ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను అసెంబ్లీలో చర్చించాలని డిమాండ్ చేస్తూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.జగన్మోహన్‌రావు మాట్లాడుతూ 16 రోజుల సమ్మె సందర్భంగా గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ రాతపూర్వకంగా ఇచ్చిన హామీలకు జీవోలు ఇవ్వకుండా కాలయాపన చేయడం తగదని అన్నారు. క్లీన్ ఎన్విరాన్‌మెంటల్ వర్కర్స్‌కు రూ.21వేలు, డ్రైవర్లకు రూ.24వేలు జీతం పెంపు జీవోలు తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్, పంప్ హౌస్, క్లాప్ వాహన డ్రైవర్లు, ప్లాంటేషన్ కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలన్నారు. జీవో నెంబర్ 30 సవరించి స్కిల్డ్ , సెమి స్కిల్డ్ వేతనాలు అమలు చేయాలని, పంపు హౌస్, ప్లాంటేషన్ కార్మికులకు బకాయి జీతాలు చెల్లించాలని, పారిశుధ్య కార్మికులకు 2 నెలల హెల్త్ అలవెన్స్ లు, జీవో నెంబర్ 7 ప్రకారం క్లాప్ డ్రైవర్లకు, సూపర్‌వైజర్లకు రూ. 18500 జీతం , సబ్బులు, నూనెలు, చెప్పులు, బట్టలు, బ్లౌజులు తదితర రక్షణ పరికరాలు, పనిముట్లు, సరెండర్ లీవ్ డబ్బులు చెల్లించాలని ,జిపిఎస్ అకౌంట్లు తెరవాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సిఐటియు నగర కార్యదర్శి ,బి. రమణ, నాయకులు బాబురావు ,లక్ష్మి, సంతోషం, పైడ్రాజు, గౌరీ ,వెంకటమ్మ, ప్రశాంత్, చిన్న సూరి, బాబురావు, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

విమానాశ్రయ భూముల్లో ఆర్‌డిఒ పర్యటన

ప్రజాశక్తి - భోగాపురం

రైతుల సమస్యలపై విమానాశ్రయ భూముల్లో ఆర్‌డిఒ సూర్యకళ మంగళవారం పర్యటించారు. సమస్యలు పరిష్కరిస్తామని రైతులకు ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. రాష్ట్ర హౌసింగ్ బోర్డ్ డైరెక్టర్, ఎ.రావివలస సర్పంచ్ ఉప్పాడ శివారెడ్డి, జెసిఎస్ మండల కన్వీనర్ బైరెడ్డి యర్రప్పల నారాయణ సోమవారం స్పందనతో పాటు జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు, ఆర్డీవోకు సోమవారం ఫిర్యాదు చేశారు. అప్రోచ్ రోడ్డు, ప్రహరీ గోడ నిర్మాణంతో వివిధ గ్రామాలకు, శ్మశాన వాటికకు వెళ్లేందుకు రహదారి సౌకర్యం లేదని ఫిర్యాదు చేశారు. దీనిపై ఆర్‌డిఒ స్పందించి మంగళవారం సంబంధిత గ్రామాల్లో పరిశీలించారు. అప్రోచ్ రోడ్డు నిర్మాణంలో రైతుల సమస్యలను పరిగణలోకి తీసుకొని ఒక మ్యాప్ తయారు చేయాలని జిఎంఆర్ సంస్థ ప్రతినిధి సుబ్బారావుకు ఆదేశించారు. అప్రోచ్ రోడ్ కి సంబంధించిన పరిహారం విశాఖ ట్రిబ్యునల్ కోర్టులో జమ చేయడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని ఉప్పాడ శివారెడ్డి, బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆర్‌డిఒ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సమస్యను పరిష్కారం చేసేందుకు ప్రయత్నిస్తున్నామని ఆమె అన్నారు. తహశీల్దార్ శ్యాం ప్రసాద్, సర్వేయరు ముదికేశ్వరరావు, విఆర్ఒ తదితరులు పాల్గొన్నారు.

పరిహార తేల్చకపోతే అప్రోచ్ రోడ్ నిర్మాణం అడ్డుకుంటాం

విమానాశ్రయం అప్రోచ్ రోడ్డుకు సంబంధించిన పరిహారం కోర్టులో వేయడం వలన ఇబ్బందులు పడుతున్నామని బైరెడ్డి పాలెం గ్రామానికి చెందిన కొల్లి రాంబాబు అనే రైతు అధికారుల ముందు ఆగ్రహం వ్యక్తం చేశాడు. పరిహారం తేల్చకపోతే అవసరమైతే అప్రోచ్ రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకుంటామని తెలిపాడు.

అప్రోచ్‌రోడ్డు మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ



సిఐటియు నాయకులకు పోరాట నిధిని అందజేస్తున్న లక్ష్మి

మిమ్స్ ఉద్యోగుల పోరాటానికి పెరుగుతున్న మద్దతు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

సమస్యల పరిష్కారానికి పోరాడుతున్న మిమ్స్‌ఉద్యోగులకు రోజు రోజుకూ మద్దతు పెరుగు తోంది. బకాయి ఉన్న ఏడు నెలల డిఎ చెల్లించాలని, సస్పెండ్ చేసిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ మిమ్స్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్వర్యంలో ఉద్యోగులు ఆందోళనలు చేస్తున్న విషయం తెలిసిందే. వీరి పోరాటం మంగళవారానికి ఆరో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా తామాడ లక్ష్మీ తనకు వచ్చే వృద్ధాప్య పింఛను రూ.3వేలును పోరాట నిధికి విరాళంగా అందజేశారు. అదేవిధంగా కల్యాణ సత్యారావు రూ.5వేలు, ఎం.భీమేష్ రూ.2వేలు, కలిశెట్టి శ్రీనివాస్ రూ.2వేలు, మిమ్స్ ఉద్యోగుల పోరాటానికి సంఘీభావ నిధి అందజేస్తూ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ మిమ్స్ పోరాటం న్యాయమైనదని, అందుకే రోజురోజుకు ఈ పోరాటానికి మద్దతు పెరుగుతున్నదని తెలిపారు. సోమవారం కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నా సందర్భంగా కలెక్టర్‌కు వినతినిచ్చామని, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్‌కు సమస్య పై జాయింట్ మీటింగు ఏర్పాటు చేసి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారని తెలిపారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం 11 గంటలకు విజయనగరం లేబర్ ఆఫీస్‌లో డిసిఎల్‌తో చర్చలు ఏర్పాటు చేశారని, ఈ చర్చలు సఫలం కావాలని ఆకాంక్షించారు. యాజమాన్యం స్పందించి సమస్యలు పరిష్కరించాలన్నారు.చర్చలు విఫలమైతే పోరాటాన్ని మరింత ఉధృతం చేయటానికి సిద్ధమవుతామని తెలిపారు.

నేడు డిసిఎల్ కార్యాలయలో చర్చలు

పరిశుభ్రతే ధ్యేయంగా పని చేయాలి

విజయనగరం టౌన్ : నగర పరిశుభ్రతే ధ్యేయంగా ప్రజారోగ్య సిబ్బంది మరింతగా కృషి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.మల్లయ్య నాయుడు ఆదేశించారు. విచ్చలవిడిగా చెత్తాచెదారాలు ఎక్కడబడితే అక్కడ వేయకుండా ప్రజలలో మరింత అవగాహన తీసుకురావాలని సూచించారు. మంగళవారం వాహనాల డిపోను ఆయన సందర్శించారు. ప్రతి రోజూ ఉదయం 6 గంటల సమయం కల్లా సంబంధిత డివిజన్లలో వాహనాలు తరలించాలని ఆదేశించారు. పుష్ కార్టులు, డంపర్ బిన్లు మరమ్మతులకు గురైతే వాటి వివరాలు పూర్తిస్థాయిలో అందివ్వాలని చెప్పారు. ఇందుకోసం ప్రత్యేకంగా సమావేశాన్ని నిర్వహించ నున్నట్లు తెలిపారు. రహదారులపై, జనావాసాల ప్రాంతాలలో చెత్తాచెదారాలు పేరుకుపోకుండా అనునిత్యం శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో పారిశుధ్య పర్యవేక్షకుడు బాలకష్ణ, ప్రజారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆన్ లైన్‌లో పోస్టుల నియామక మెరిట్ జాబితాలు

విజయనగరం కోట : ప్రభుత్వ వైద్య కళాశాలలో బయో మెడికల్ టెక్నీషియన్, కార్డియాలజీ టెక్నీషియన్, ఓటి టెక్నీషియన్ పోస్టుల మెరిట్ జాబితాలు ఆన్ లైన్‌లో ఉంచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.పద్మలీల తెలిపారు. http://vizianagaram.ap.gov.in, http:// vizianagaram.nic.in వెబ్‌సైట్‌లలో ఈ పరీక్షల ఫలితాలు తెలుసుకోవచ్చన్నారు. ఎపి వైద్యవిధాన పరిషత్ నుంచి ఆప్షన్ ద్వారా వచ్చిన ప్లంబర్‌లను వైద్య విద్యాశాఖ డైరక్టరేట్ లోకి తీసుకున్న కారణంగా ఈ పోస్టుల నియామకం కోసం వేసిన నోటిఫికేషన్ రద్దు అయినట్లు తెలిపారు. దీనిపై సవరణ నోటిఫికేషన్ జారీ చేశామని తెలిపారు.

ఆర్‌టిసి ప్రయాణికులకు బహుమతులు

విజయనగరం కోట : ఆర్టీసీ ప్రయాణికులకు ఆ సంస్థ అధికారులు మంగళవారం ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. విజయ నగరం డిపో నుంచి సింహాచలం, ఆంధ్ర, చీపురుపల్లి-మెరకముడిడాం, విజయనగరం-జామి -ఎస్. కోట మార్గాల్లో నడుపుతున్న ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేసి గిఫ్ట్‌స్కీంలో ఎంపికైన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజరు బి. ఆదినారాయణ, ఎస్‌టిఐ పి.రామారావు, స్టేషన్ మేనేజర్ పి.సత్యనారాయణ, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు

మోడీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలి

ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ

ప్రజాశక్తి-బొబ్బిలి

సదస్సులో మాట్లాడుతున్న అజశర్మ

రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ. అజశర్మ పిలుపునిచ్చారు. స్థానిక షాదీఖానాలో మంగళవారం యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.విజయగౌరి అధ్యక్షతన లౌకికవాదం-రాజ్యాంగ పరిరక్షణపై సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో అమృత ఉత్సవాలు జరుపుకుంటున్న సమయంలో భారత రాజ్యాంగం పెద్ద ప్రమాదాన్ని ఎదుర్కొంటుం దన్నారు. రాజ్యాంగం ప్రకారం ఎన్నుకోబడిన కేంద్ర ప్రభుత్వంతోనే రాజ్యాంగానికి ప్రమాదం వస్తుందని విమర్శించారు. రాజ్యాంగ పీఠికలో పేర్కొన్న స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతత్వం, లౌకికవాదం అంశాలకు పూర్తిగా బిజెపి ప్రభుత్వం తిలోదకాలు ఇస్తుందన్నారు. మత విద్వేషాలు రెచ్చగొట్టి అధికారంలోకి రావడానికి ప్రధాన ఆయుధంగా ఎంచుకుందని విమర్శించారు. అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవాన్ని రాజ్యాంగ విలువలకు భిన్నంగా ప్రభుత్వ కార్యక్రమంగా మార్చివేశరన్నారు. బాబ్రీ మసీదు కూల్చివేతను, ఆస్థలాన్ని రామమందిరానికి కేటాయించడంలో అనుకూలంగా తీర్పు ఇచ్చిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి రాజ్యసభ పదవీ మోడీ ప్రభుత్వం ఇచ్చిందన్నారు. బాబ్రీ మసీదు కూల్చివేతలోను రామమందిరం నిర్మాణం దేశవ్యాప్త సమస్యగా చేయడంలో ప్రధాన సూత్రధారి అయిన ఎల్.కె అద్వానీకు భారతరత్న ఇచ్చారన్నారు. 1991లో చేసిన చట్టానికి భిన్నంగా నేడు అనేక మసీదులను వివాదాస్పదం చేస్తుందన్నారు. వారాణసిలో జ్ఞానవాపి మసీదులో కోర్టు తీర్పు అనుకూలంగా రప్పించుకుని పూజలు ప్రారంభించిందన్నారు. మతాన్ని రాజకీయం చేయకూడదని, ప్రభుత్వం మత వ్యవహారాల్లో జోక్యం చేసుకోకూడదని రాజ్యాంగంలో స్పష్టంగా పేర్కొన్నదానికి భిన్నంగా మతాన్ని రాజకీయంగా వినియోంచుకోవడమే ఎజెండాగా మోడీ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. తాజాగా మోడీ పార్లమెంటులో ప్రసంగిస్తూ మరోసారి తామే గెలుస్తామని, రాబోయే వెయ్యేళ్లకు సరిపడా పునాదిని భారతదేశంలో వేస్తామని ప్రకటించడం చూస్తే మత విద్వేషాలు ఎలా రెచ్చగొట్టి భారతదేశాన్ని మత రాజ్యంగా స్థాపించి ఆర్.ఎస్.ఎస్ ఎజెండాను అమలు చేయడమే లక్ష్యంతో పని చేస్తారన్నారు. ప్రపంచంలో అతిగొప్ప రాజ్యాంగం భారతదేశంలో ఉందని, రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే ప్రజల ముందున్న కర్తవ్యమని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో మోడీ విధానాలకు వత్తాసు పలుకుతున్న పార్టీలను కూడా ఓడించడం రాష్ట్ర ప్రజలపై కర్తవ్యంగా ఉండాలన్నారు.

సదస్సులో సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, హుదా ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జాఫర్, మసీదు కమిటీ సభ్యులు హమీద్, యుటిఎఫ్ నాయకులు వై. స్వామి నాయుడు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు పి.రామ్మోహన్, ఇప్టా నాయకులు ఎం.గోపాలం, ఫాస్టర్స్ అసోసియేషన్ నాయకులు జయరాజు, కె.అదష్టకుమార్, తదితరులు పాల్గొన్నారు.

యాదవులకే సీటు కేటాయించాలి

నగరంలో భారీ ప్రదర్శన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం అసెంబ్లీ స్థానిక టిక్కెట్ రాజకీయ పార్టీలు యాదవులకే కేటాయించాలని కోరుతూ యాదవ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యాన కోట జంక్షన్ నుంచి అంబేద్కర్ కూడలి వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో యాదవ సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు బిసపు. సాయికిరణ్ యాదవ్ మాట్లాడుతూ విజయనగరం జిల్లాలో 2లక్షల 50వేల మంది ఓటు బ్యాంకు ఉన్న యాదవులకు ఇప్పటివరకు ఒక ఎమ్మెల్యే, ఒక ఎమ్మెల్సీ స్థానాన్ని కూడా ఇవ్వలేదని అన్నారు. అన్ని రాజకీయ పార్టీలు యాదవులను అణగదొక్కారని, కనీసం ఎంపిపి, జెడ్‌పిటిసి పదవులు కూడా ఇవ్వలేదని అన్నారు. విజయనగరం నియోజకవర్గంలో 65 వేల ఓటు బ్యాంకు ఉన్నప్పటికీ 15ఏళ్ల నుంచి మున్సిపాలిటీకి మాత్రమే పరిమితం చేశారని, ఈసారి విజయనగరం అసెంబ్లీ సీట్లు యాదవులకే కేటాయించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో ఏ ఎమ్మెల్యే గెలిచినా ఐదు నుంచి 10వేల మెజార్టీతోనే గెలుస్తున్నారని, ప్రతి నియోజకవర్గంలో తమకు 30 వేలకు పైగా ఓటు బ్యాంకు ఉన్నందున తాము గెలిపించగలం , ఓడించగలమని గుర్తుపెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో గొలగాన రమేష్ యాదవ్, యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు ఇస్రాపు శేఖర్ యాదవ్ యాదవ సంఘం ఐక్యవేదిక జిల్లా మహిళా అధ్యక్షురాలు లక్ష్మీ , తెలుగు యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు ఆది బాబు, యాదవ సంఘం ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు పి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న యాదవులు

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సౌకర్యాలు

బొబ్బిలి రూరల్: పోలింగ్ కేంద్రాలలో మౌలిక సౌకర్యాలు ఉండేలా చూడాలని రెవెన్యూ, మున్సిపల్, మండల పరిషత్ అధికారులను ఆర్డీఒ ఎ. సాయిశ్రీ ఆదేశించారు. తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం రెవెన్యూ, మున్సిపల్, మండల పరిషత్ అధికారులతో నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తనిఖీ చేసి మౌలిక సౌకర్యాలు ఉండేలా చూడాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో తాగునీరు, విద్యుత్, ఫర్నిచర్ సౌకర్యం ఉండేలా చూడాలన్నారు. మరుగుదొడ్డి సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి, తహశీల్దార్లు, ఎంపిడిఒలు పాల్గొన్నారు.

'ఒపిఎస్ అమలు చేసే పార్టీకే మా ఓటు'

జామి: ఒపిఎస్ అమలు చేసే పార్టీలకే వచ్చే ఎన్నికల్లో ఓటు వేస్తామని యుటిఎఫ్ ప్రతినిధులు. ఈ మేరకు జామి ఎంఆర్‌సి కార్యాలయం ఎదుట యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలియజేశారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు పాల్గొని యుటిఎఫ్ ఓట్ ఫర్ ఒపిఎస్ అనే పోస్టర్‌ను విడుదల చేశారు. మండల అధ్యక్షులు వాసుదేవరావు, ట్రెజరర్ శ్రీధర్, జిల్లా కార్యవర్గ సభ్యులు దేముడుబాబు, మహిళా సభ్యులు ఆదిపమ్మ, మాధవీలత, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ టికెట్‌కు దరఖాస్తు

బొబ్బిలి: బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు తనకు టికెట్ కేటాయించాలని పిసిసి సభ్యులు మువ్వల శ్రీనివాసరావు రాష్ట్ర అధిష్టానానికి దరఖాస్తు చేసుకున్నారు. విజయవాడలో ఆంధ్రరత్న భవన్‌లో జిల్లా అధ్యక్షులు ఎస్.రమేష్ కుమార్‌తో కలిసి మంగళవారం దరఖాస్తు అందజేశారు. తనకు టికెట్ ఇస్తే కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఆయనతో నగర అధ్యక్షులు సుంకరి సతీష్, గజపతినగరం నాయకులు నాయుడు, చీపురుపల్లి నాయకులు సూర్యనారాయణ ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

బొబ్బిలి: స్థానిక అభ్యుదయ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. అభ్యుదయ పాఠశాల, అభ్యుదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అభ్యుదయ ప్రిన్సిపాల్ చింతా శారద మాట్లాడుతూ పేదలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించామన్నారు. వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. మహిళలకు కేన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. వైద్య శిబిరానికి 200మంది రోగులు హాజరై వైద్య సేవలు పొందారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎం.కార్తీనాయుడు, సిబ్బంది, వైద్యులు పాల్గొన్నారు.

పేదల కోసమే నవరత్నాలు

బొబ్బిలి: పేదల కోసమే వైసిపి ప్రభుత్వం నవరత్నాలు అమలు చేస్తుందని మున్సిపల్ వైస్ చైర్మన్ చెలికాని మురళి, వైసిపి పట్టణ అధ్యక్షులు బొడిగంజి రమేష్‌నాయుడు అన్నారు. మున్సిపాలిటీలోని ఇందిరమ్మ కాలనీలో చెలికాని మురళి, 2,3 సచివాలయాల్లో బొడిగంజి రమేష్ నాయుడు పర్యటించి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని, రానున్న ఎన్నికల్లో వైసిపిని గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

నెల్లిమర్ల: అంబేద్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కె. ఉషారాణి కోరారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో 5వతరగతి ఇంగ్లీష్ మీడియం, ఇంటర్ సిబిఎస్‌ఇలో ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలన్నారు. 5వ తరగతి ప్రవేశానికి గుర్తింపు పొందిన పాఠశాలలో 3,4 తరగతులు చదివి వార్షిక ఆదాయం లక్ష రూపాయలకు మించకుండా ఉండాలన్నారు. ఇంటర్ సిబిఎస్‌ఇకి 80 సీట్లు ఇంగ్లీష్ మీడియంలో ఉంటాయని 5వ తరగతి, ఇంటర్ ప్రవేశానికి ఈ నెల 23లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్ష వచ్చే నెల 10న జరుగుతుందని ఆసక్తి ఉన్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా హరి

బొండపల్లి : బొండపల్లి ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా పప్పు హరి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. హరి కలెక్టరేట్‌లో డిప్యూటీ తహశీల్దార్‌గా పని చేస్తూ బొండపల్లి బదిలీ పై వచ్చారు. ఇక్కడ డిప్యూటీ తహశీల్దార్‌గా పని చేసిన రౌతు శంకరరావు గుర్ల బదిలీ కావడంతో డిప్యూటీ తహశీల్దార్‌గా హరి బాధ్యతలు చేపట్టారు. కాగా ఇటీవల ఇక్కడ తహశీల్దార్ రమణయ్య హత్యకు గురికావడంతో హరికి ఇంచార్జ్ తహశీల్దార్‌గా బాధ్యతలు అప్పగించారు.

మండల విప్ కుటుంబానికి ఎంపి పరామర్శ

రేగిడి: మండలంలోని సంకిలి గ్రామానికి చెందిన వైసిపి విప్ మజ్జి శ్రీనివాసరావు తల్లి ఇటీవల మృతి చెందిన విషయాన్ని ఎంపి బెల్లాన చంద్రశేఖర్ తెలుసుకుని మంగళవారం ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఎంపితో పాటు వైస్‌ఎంపిపి వావిలపల్లి జగన్నాథనాయుడు, ఉంకిలి ఆచ్చంనాయుడు, సంకిలి సొసైటీ అధ్యక్షులు రాయపురెడ్డి కృష్ణారావు, కార్యకర్తలు ఉన్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన

రామభద్రపురం: ఈవిఎంల ద్వారా ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించేందుకు మాక్ పోలింగ్ నిర్వహించారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ సులోచనారాణి ఆధ్వర్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటు ఎలా వినియోగించుకోవాలో అవగాహన కల్పిస్తూ ఈవిఎం, కంట్రోల్, వివిపాట్ మిషన్లను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గిరడ షణ్ముఖనాయుడు, టిడిపి నాయకులు కనిమెరక నాగేశ్వరరావు, గొర్లె రామారావు, ఓటర్లు, వికలాంగులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం సొంపురంలో ఏఆర్ఒ ఆధ్వర్యంలో ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రతి ఓటరు నిర్భయంగా, స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకొని మంచి నాయకులను ఎన్నుకోవాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల నిర్వహణకు నిధులు

తెర్లాం: మండలంలో ఎన్నికల నిర్వహణ నిమిత్తం గుర్తించిన 62 పోలింగ్ కేంద్రాలలో నిర్వహణకు ప్రభుత్వం ఆయా స్కూల్ మేనేజిమెంట్ (గ్రాండ్)లో నిధులు జమ చేసిందని ఎంఇఒ జె. త్రినాథరావు తెలిపారు. ఉపాధ్యాయులు ఎవరు పోలింగ్ కేంద్రాల నిర్వహణలో అలసత్వం వహించవద్దని చెప్పారు.

బిఎల్‌ఒలకు శిక్షణ

వేపాడ: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో మంగళవారం బిఎల్‌ఒలకు నియోజకవర్గ ఎన్నికల ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ పి. మురళీ కృష్ణ ఎన్నికల విధులపై శిక్షణ ఇచ్చారు. ఏ విధమైన ఇబ్బందులు జరిగినా నిబంధనల ప్రకారం సంబంధిత బిఎల్‌ఒ పైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ కె. ప్రసన్నకుమార్, డిటి సన్యాసినాయుడు, మండల పరిషత్ పంచాయతీ ఇంజనీరింగ్ అధికారి అలీ, ఎంఇఒ పి. బాల భాస్కరరావు, ఆర్‌ఐ రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి : ఎస్‌టియు

విజయనగరం టౌన్: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని ఎస్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కరణం జోగారావు డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శ్యామ్ అధ్యక్షతన ఆ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం మంగళవారం అమర్‌భవన్‌లో జరిగింది. జోగారావు మాట్లాడుతూ ఎన్నికల లోపు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపాధ్యాయ ఉద్యోగ సమస్యలు పరిష్కరించాలన్నారు. జీవో 117ను తక్షణమే రద్దు చేయాలని, పిఎఫ్, ఎపిజిఎల్‌ఐ బకాయిలు, డిఎలు చేయాలని డిమాండ్ చేశారు.

టిడిపిలోకి వెల్దూరు సర్పంచ్

పూసపాటిరేగ : మండలంలోని వెల్దూరు సర్పంచ్ నాయిని సత్యవతితో పాటు ఐదుగురు వార్డు సభ్యులు, 300 కుటుంబాలు మంగళవారం టిడిపిలో చేరారు. వీరికి మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామి సమక్షంలో నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ కర్రోతు బంగార్రాజు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మహంతి చిన్నంనాయుడు, పతివాడ తమ్మునాయుడు, సువ్వాడ రవిశేఖర్, కంది చంద్రశేఖర్‌రావు, పతివాడ అప్పలనారాయణ, మహంతి శంకర్రావు, కర్రోతు సత్యనారాయణ, కడగల ఆనంద్ పాల్గొన్నారు.

విజయనగరం టౌన్: నగరంలోని 1,4 డివిజన్లకు చెందిన పలు కుటుంబాలు మంగళవారం వైసిపిని వీడి టిడిపిలో చేరాయి. టిడిపి కార్యాలయం అశోక్‌బంగ్లాలో నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ అదితి గజపతి సమక్షంలో పుష్ప సంతోష్, పి.మోహన్, మామాపురం శేఖర్ తదితరులు టిడిపిలో చేరారు. అనంతరం ఉపాధి కరువైన తమను ఆదుకోవాలని నగరంలోని రిక్షా, మెకానిక్ వర్క్ యూనియన్ సభ్యులు అదితి గజపతికి కోరారు. ఈ మేరకు వినతిని అందజేశారు. సమస్యలను చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని ఆమె చెప్పారు.

అమ్మకాలు హానికరం

- మద్యం విచ్చల విడిగా అమ్మేస్తే కేసులు
- ఇప్పటి వరకు పట్టుబడిన వ్యక్తిపైనే చర్యలు
- ఇకపై అమ్మకాలు చేసిన సిబ్బందిపైనా కేసులు
- పేరాపురం సేల్స్‌మేన్‌ను తొలగించడంతో పాటు కేసు నమోదు

ప్రజాశక్తి - భోగాపురం

ప్రభుత్వ మద్యం షాపులు నుంచి బెల్టు షాపులకు మద్యం విచ్చలవిడిగా అమ్మకాలు చేస్తే పట్టుబడిన వ్యక్తితో పాటు అమ్మకాలు చేసిన షాపులోని సేల్స్‌మేన్, సూపర్ వైజర్లపై కూడా కేసులు నమోదు చేసేందుకు కొత్తగా వచ్చిన భోగాపురం స్పెషల్ ఎన్‌ఫోర్స్ మెంట్ బ్యూరో సిఐ కె. సురేష్ సిద్ధమయ్యారు. ఇటీవలి అక్రమంగా మద్యం పట్టుబడడంతో సంబంధిత వ్యక్తితో పాటు అమ్మకాలు చేసిన సేల్స్‌మేన్ పై కూడా కేసు నమోదు చేయడం విశేషం. అంతేకాక అధికారులు వెంటనే ఆ సేల్స్‌మేన్‌ను కూడా తొలగించారు. ఈ ఘటనతో మద్యం షాపుల్లో పనిచేసే సేల్స్‌మేన్‌లు, సూపర్‌వైజర్లు హడలెత్తిపోతున్నారు.

భోగాపురం ఎస్ఇబి పరిధిలో 16 ప్రభుత్వ మద్యం షాపులు ఉన్నాయి. ఇటీవలి బదిలీల్లో భాగంగా విశాఖ నుంచి కె. సురేష్ ఇక్కడ సిఐగా బాధ్యతలు స్వీకరించారు. పూసపాటిరేగ మండలంలోని పసుపాం గ్రామంలో ఐదు రోజులు కిందట ఓ వ్యక్తి అక్రమంగా మద్యం నిల్వ ఉంచాడన్న సమాచారం వచ్చింది. దీంతో సిఐ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. సుమారు 100 మద్యం సీసాలు పట్టుబడ్డాయి. ఇంత మొత్తంలో పట్టుబడడంతో ఇవి ఎక్కడ నుంచి కొనుగోలు చేశారనేదానిపై దృష్టి పెట్టి విచారణ చేశారు. ఖచ్చితంగా ఏదో షాపు సేల్స్‌మేన్ హస్తం ఉంటుందని అనుమానించారు. వెంటనే విచారణ వేగవంతం చేశారు. పేరాపురంలో ఉన్న ప్రభుత్వ మద్యం షాపు సేల్స్‌మేన్ పైలా సన్యాసిరావు ఇంత మొత్తంలో సీసాలను బయటకు ఇచ్చినట్లు తేలింది. వెంటనే ఏ1గా మద్యం కలిగి ఉన్న వ్యక్తిని, ఎ2గా సేల్స్‌మేన్‌ను చేర్చి ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఈ విషయాన్ని నెల్లిమర్ల డిపో మేనేజర్ దృష్టికి వెళ్లడంతో ఆయన వెంటనే సంబంధిత సేల్స్‌మేన్‌ను తొలగించి కొత్త వ్యక్తిని నియమించారు. అయితే మద్యంతో పట్టుబడిన వ్యక్తితో పాటు అతనికి మద్యం ఎక్కువ మొత్తంలో విక్రయించిన వ్యక్తిపై కూడా కేసు నమోదు కావడం చర్చనీయాంశంగా మారింది.

పేరాపురంలో ఇటీవల దొరికన మద్యంతో సిఐ, సిబ్బంది

సీసాపై రూ.పది వసూలు చేసి విక్రయం

ప్రభుత్వ మద్యం షాపుల్లో పనిచేస్తున్న కొంత మంది సేల్స్‌మెన్లు, సూపర్‌వైజర్లు గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహించే వారితో ముందస్తుగా ఒప్పందం చేసుకుని సీసాపై ఐదు నుంచి పది రూపాయలు వరకూ అదనంగా తీసుకొని విచ్చలవిడిగా బెల్టు షాపులకు వందలాది సీసాలను ఇచ్చేస్తున్నారు. బెల్టు షాపుల నిర్వాహుకులు అదే సీసాపై రూ.20 నుంచి రూ.30 అదనంగా వసూలు చేసి మందుబాబులను దోచుకుంటున్నారు. కాసులకు కక్కుర్తి పడిన సేల్స్‌మేన్లు, మేనేజర్లు విచ్చలవిడిగా మద్యం సీసాలను బెల్టుషాపులకు ఇవ్వడంతో గ్రామాల్లో బెల్టు షాపుల సంఖ్య పెరిగిపోయింది. పసుపాం సంఘటనతో ప్రభుత్వ మద్యం షాపుల్లో పనిచేస్తున్న సేల్స్‌మేన్లు, సూపర్ వైజర్లు అప్రమత్తమయ్యారు.

సేల్స్‌మేన్ పై కేసు ఇదే మొదటి సారి

ప్రభుత్వం ఎస్ఇబి శాఖ ఏర్పాటు చేసిన తరువాత ఇప్పటి వరకూ ఎంతో మంది అధికారులు బెల్టు షాపులపై దాడులు చేసిన సందర్భాలు ఉన్నాయి. వందల్లో మద్యం సీసాలు పట్టుబడిన సందర్భాలు కూడా అనేకం ఉన్నాయి. కాని పట్టుబడిన వ్యక్తులు తప్ప సేల్స్‌మేన్‌లపై కేసు నమోదు చేయడం ఇప్పటి వరకు జరగలేదు. కొత్తగా వచ్చిన సిఐ మాత్రం మొట్టమొదటిసారి ఇలాంటి కేసు నమోదు చేయడం సంచలనంగా మారింది. తీరప్రాంత గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా బెల్టుషాపులు కోసం వేలం పాటలు జరిగాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఇటీవలి లా అండ్ ఆర్డర్ పోలీసులు భోగాపురం మండలంలో వేలం పాట పాడిన రెండు గ్రామాలకు చెందిన ఇద్దరు వ్యక్తులను మద్యం సీసాలతో పట్టుకొని కేసులు నమోదు చేశారు. పూసపాటిరేగ మండలంలో ఎస్ఇబి అధికారులు కూడా భారీగా మద్యం సీసాలతో ఒక వ్యక్తిపై కేసు నమోదు చేశారు. దీంతో బెల్టుషాపుల నిర్వాహుకులు, మద్యం షాపుల్లో పనిచేస్తున్న సిబ్బంది వెన్నులో వణుకు మొదలైందన్న చర్చ జరుగుతోంది.

కచ్చితంగా కేసులు నమోదు చేస్తాం

ప్రభుత్వం మద్యం షాపులు నుంచి విచ్చలవిడిగా బెల్టు షాపులకు మద్యం అమ్మడం నేరం. అక్రమ మద్యం కలిగి ఉన్న వారెవరైనా పట్టుబడితే విచారణ చేస్తాం. ఇందులో సేల్స్‌మేన్, సూపర్‌వైజర్ పాత్ర ఉందంటే వారిపై కూడా ఖచ్చితంగా కేసులు నమోదు చేస్తాం. అందుకు ప్రభుత్వ నిబంధనలకు లోబడే అమ్మకాలు చేయాలి.

కె. సురేష్, ఎస్ఇబి, సిఐ, భోగాపురం

బొగ్గుల దిబ్బలో దళితుల ఇళ్లు తొలగింపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని 40వ డివిజన్ బొగ్గులదిబ్బ ఎస్‌సి కాలనీలో 50ఏళ్లుగా నివాసముంటున్న దళితుల ఇళ్లను మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు మంగళవారం తొలగించారు. ప్రభుత్వ స్థలంలో నిర్మించుకున్న ఈ ఇళ్లను తొలగిస్తామని గతంలో అధికారులు చెప్పడంతో 18 కుటుంబాల వారు ముందుగానే న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, వారి వాదనలను విని ఈనెల 7వ తేదీ వరకు గడువు విధించింది. అయినప్పటికీ కార్పొరేషన్ సిబ్బంది మంగళవారం తెల్లవారి ఇళ్లను జెసిబితో తొలగించారు. విషయం తెలుసుకున్న సిపిఎం నాయకులు రెడ్డి శంకర్రావు, బి.రమణ, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పి.అదితి గజపతి అక్కడికి చేరుకొని అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ పోలీసుల సాయంతో సిబ్బంది ఆ ఇళ్లను తొలగించారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకర్రావు మాట్లాడుతూ దళితుల ఇళ్ల తొలగింపు అన్యాయమని. ఎటువంటి నోటీస్ ఇవ్వకుండా, రాత్రి 12 గంటలకు వాలంటీర్ వెళ్లి తలుపు కొట్టి తెల్లారేసరికి ఇళ్లు తొలగిస్తామని చెప్పడం, ప్రజల లేచేటప్పటికే పోలీసులు, మున్సిపల్ అధికారులు వచ్చి దళితుల ఇళ్లు కూల్చేసి నిలువ నీడ లేకుండా చేయడం అన్యాయమని అన్నారు. వెంటనే పేదలకు ప్రత్యామ్నాయం చూపించాలని డిమాండ్ చేశారు. టిడిపి నాయకులు అదితి గజపతి మాట్లాడుతూ చట్టానికి కూడా కనీసం గౌరవం ఇవ్వకుండా చేస్తున్నారని, కనీసం బాధితులు వారి సామాన్లను ఇంట్లో నుండి తీసుకొనే అవకాశం ఇవ్వకపోవడం అన్యాయమని అన్నారు. బాధితులకు అండగా ఉంటామన్నారు. ప్రత్యామ్నాయం చూపకుండా ఇలా తొలగించడం దుర్మార్గమైన చర్య అన్నారు. వెంటనే వీరికి ప్రత్యామ్నాయం కల్పించాలని డిమాండ్ చేశారు . దళితులకు న్యాయం జరిగే వరకూ అన్ని విధాలా సిపిఎం,టిడిపి పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయం కల్పించాలని సిపిఎం, టిడిపి డిమాండ్

ఇంటిని జెసిబితో తొలగిస్తున్న డ్రైవర్

గ్రీన్ అంబాసిడర్ల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పంచాయతీ కార్మికులకు - గ్రీను అంబాసిడర్లకు బకాయి జీతాలు చెల్లించి, వేతనాల పెంపు జిఒను అమలుచేయాలని డిమాండ్ చేస్తూ గ్రీన్ అంబాసిడర్లు మంగళవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ జిల్లా కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలను పరిశుభ్రం చేసి పర్యావరణ ప్రజారోగ్యాన్ని పరిరక్షిస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు, గ్రీను అంబాసిడర్లు, గ్రీన్‌గార్డ్స్, టైం స్కేల్ వర్కర్లకు పెండింగ్‌లో ఉన్న బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనాలు పెంచాలని, టెండర్స్ రద్దు చేయాలని, గుర్తింపు కార్డులు పిఎఫ్, ఇఎస్ఐ గ్రాట్యుటీ, పెన్షన్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రతి నెలా 5వ తేది లోపు జీతాలు చెల్లించాలని 2019 ఫిబ్రవరిలో జారీ చేసిన జీవో 132 స్పష్టంగా పేర్కొంటున్నా ఎక్కడా అమలు కావడం లేదన్నారు. 2 నుండి 18 నెలలు జీతాలు బకాయిలు ఉన్నాయని, వెంటనే వాటిని చెల్లించాలని కోరారు. పారిశుధ్య కార్మికులకు కనీస వేతనం రూ.18వేలు ఇస్తామని చెప్పిన జగన్ హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నా లో యూనియన్ అధ్యక్షులు జి.శ్రీను, బి.రమణ, కామేష్ కార్మికులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న గ్రీన్ అంబాసిడర్లు

ప్రణాళికాయుతమైన అభ్యాసన అవసరం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

విద్యార్థులకు ప్రణాళికా బద్ధమైన అభ్యాసన, బోధనలు ఉండాలని డిప్యూటి డిఇఒ కె. వాసుదేవరావు, డైట్ ప్రిన్సిపాల్ ఎన్. తిరుపతి నాయుడు సూచించారు. మంగళ వారం స్థానిక కెజిబివి పాఠశాలను జిల్లా మోనటిరింగ్ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా డిప్యూటి డిఇఒ వాసుదేవరావు, డైట్ ప్రిన్సిపాల్ తిరుపతి నాయుడు 6,7,8, 10తరగతి విద్యార్థుల అభ్యాసన, బోధన తదితర అంశాలపై పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులకు ప్రణాళికా బద్ధంగా అభ్యాసన, బోధనలు ఉండాలని సూచించారు. ముఖ్యంగా ఆయా సబ్జెక్టుల్లో వెనుకబడ్డ విద్యారులను గుర్తించి ఉపాధ్యాయులు మెరుగైన బోధనలు అందించి ముందుకు తీసుకుని రావాల్సిన బాధ్యత ఉందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, టైం టేబుల్ ప్రకారం ప్రాజెక్టు వర్కులు పూర్తి చేసేవిధంగా కృషి జరగాలని, 10పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ఉపాధ్యాయులందరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉమా, డైట్ లెక్చరర్స్ శ్రీనివాస్, సూర్యారావు, రామకృష్ణ, బృంద సభ్యులు ఎ ప్రవీణ్ కుమార్, దామోదర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డిఇఒ వాసుదేవరావు

జగన్ పాలనను అంతమొందించడమే లక్ష్యం

ప్రజాశక్తి- మెంటాడ

ప్రజలకు మాయ మాటలు చెప్పి అధికారం చేపట్టిన జగన్మోహన్ రెడ్డి పాలనను అంతమొందిచడమే లక్ష్యంగా జనసేన పనిచేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్విని అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం జనసేన పార్టీ కార్యాలయాన్ని మాజీమంత్రి పడాల అరుణతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన జనసేన జన గర్జన సభలో యశస్విని మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు, జాబ్ క్యాలెండర్ విడుదల చేయడం లేదన్నారు. వేలకోట్ల రూపాయలు వృధాగా ఖర్చు చేసి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారన్నారు. రాష్ట్ర ప్రయోజనాలే పవన్ కళ్యాణ్ లక్ష్యమని గుర్తు చేశారు. మాజీమంత్రి పడాల అరుణ మాట్లాడుతూ రాష్ట్ర పురోగతిని తుంగలోకి తొక్కారని, ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం పెట్టి కోట్లాది రూపాయలు దోచుకున్నారని ఆరోపించారు. జనసేన మండల అధ్యక్షులు రాజశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మెంటాడ మాజీ సర్పంచ్ దేవుడు బాబు, గజపతినగరం జనసేన మండల అధ్యక్షులు మోహన్ రఘురాం కృష్ణంరాజు, ఆదాడమోహన్, టిడిపి నేతలు రెడ్డి రాజగోపాల్, రాయిపిల్లి రవిశంకర్, కొల్లా భరత్, జనసేన పార్టీ నేతలు పాండ్రంకి శ్రీనివాసరావు, శివ, మండల సురేష్, పలు గ్రామాలకు చెందిన జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యశస్విని

గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష-2

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని పినతాడివాడలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎంపిపి బంటుపల్లి వెంకటవాసుదేవరావు సందర్శించారు. రోగుల రిజిస్ట్రేషన్ జరిగే విధానం, లాబ్‌టెస్ట్, ఫార్మసీ, కంటి వైద్య శిబరాలను సందర్శించి వివరాలను ఆరా తీశారు. ఈ శిభిరంలో డెంకాడ పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఎం. శివరామకృష్ణ, డాక్టర్ రాజ్‌కుమార్‌లు వైద్య సేవలందించారు. అనంతరం 407 మంది రోగులకు తనిఖీలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్పెషలిస్ట్ డాక్టర్లు అశ్వినిరెడ్డి, జె. సునీల్, మజ్జి గణపతిరావు, ఎంపిడిఒ లవరాజు, సర్పంచ్ లెంక లక్ష్మణరావు, ఎంపిటిసి విజినిగిరి అచ్చం నాయుడు, సచివాలయం, పిహెచ్‌సి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని బానాది సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 402 మందికి వైద్య సేవలందించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. సర్పంచ్ కర్రి యశోద ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో వేపాడ పిహెచ్‌సి వైద్యాధికారి ఏ ధరణి, ఎస్‌కోట వైద్యాధికారి పి.వరలక్ష్మి, ఆర్థోపెడిక్ మోహన్ రావు, విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి వైద్య నిపుణులు ఈశ్వర్‌రావు పాల్గొని వైద్య సేవలందించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ ఆంజనేయులు, పిహెచ్‌సి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నెల్లిమర్ల: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ జి.రామారావు అన్నారు. మంగళవారం గుషిణి సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కె.సింహాద్రి, సతివాడ పిహెచ్‌సి వైద్యాధికారులు కె.సాయిరాం, వైద్య బృందం తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం: ప్రతీ ఇంటికి వైద్య సేవలు అందించేందుకు సురక్ష పేరిట ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకం శత శాతం అమలు చేసేందుకు కృషి చేయాలని ఎంపిడిఒ ఈశ్వరమ్మ ఆదేశించారు. మంగళవారం జన్నివలసలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్ -2 ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలని, జగనన్న సురక్ష కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం కొట్టక్కి గ్రామ సచివాలయాన్ని సందర్శించి పలు రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మండల వైద్యాధికారులు పిల్లి దిలీప్ కుమార్, ఏయల్జీ శిరీష, స్థానిక సర్పంచ్ సారంగ దొర, వైద్య సిబ్బంద, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

పనిచేసే చోట వేధింపులు లేకుండా చూడాలి

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

పనిచేసే చోట లైంగిక వేధింపులు జరగకుండా చూసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మల్లయ్య నాయుడు అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో విజయనగరం అర్బన్ ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఒ ప్రసన్న ఆధ్వర్యంలో అర్బన్ మరియు రూరల్ ఏరియాలో ఉన్న మహిళా సంరక్షణ కార్యదర్శులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో అంతర్గత ఫిర్యాదుల కమిటీ కార్యాలయ స్థాయిలో ఏర్పాటు చేయాలన్నారు. మహిళా సంరక్షణ కార్యదర్శులు అందరూ స్కూళ్లలోనూ కాలేజీలలోను పిల్లలకు సఖి గ్రూప్ సమావేశాలు నిర్వహించాలని తెలి పారు. సిడిపిఒ ప్రసన్న మాట్లాడుతూ పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులు చట్టంపై ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అడిషనల్ కమిషనర్ తిరుమల రావు, వన్‌స్టాప్ సెంటర్ నుంచి రమా దేవి, వెంకటలక్ష్మి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి పక్షోత్సవాలను విజయవంతం చేయండి

ప్రజాశక్తి- కొత్తవలస

కుష్టు వ్యాధి పక్షోత్సవాలను విజయవంతం చేయాలని వైద్యాధికారి డాక్టర్ బి.సింహాద్రి నాయుడు కోరారు. జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా వియ్యంపేట పిహెచ్‌సి పరిధిలో గల నిమ్మళపాలెంలో మంగళవారం స్పర్శ లెప్రసీపై అవగాహనా కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్టు వ్యాధి మైకోబాక్టీరియా లెప్రే వల్ల వస్తుందని, శరీరం పై రాగి రంగులో గాని, గోధుమ రంగులో గాని స్పర్శ లేని మచ్చలు ఉంటే కుష్టు వ్యాధిగా అనుమానించవచ్చునని తెలిపారు. ఎమ్‌డిటి మందు కుష్టువ్యాధి నిర్మూలనకు అన్ని ప్రభుత్వ ఆసుపత్రిలలో ఉచితంగా దొరుకుతోందన్నారు. కుష్టు వ్యాధిగ్రస్తులను వివక్ష లేకుండా చూడాలని, వారిని ప్రేమగా, ఆప్యాయతగా పలకరించాలన్నారు. అనంతరం స్కూల్ పిల్లలతో ప్రతిజ్ఞ చేయించారు. వివక్షని నిర్మూలిద్దాం-గౌరవాన్ని స్వాగతిద్దాం, చేతులు కలుపుదాం -కుష్టు వ్యాధిని నిర్మూలిద్దాం, అని ప్రతిజ్ఞ చేయించి ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎమ్ పార్వతి, ఎమ్‌ఎల్‌హెచ్ పి. పావని, ఏఎన్‌ఎమ్ లక్ష్మి, హెల్త్ అసిస్టెంట్స్ సత్యారావు, ఉపాధ్యాయులు, ఆశాలు ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించాలని ఆర్‌టిసి డిపో మేనేజర్ కె రమేష్ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా మంగళవారం స్థానిక డిపోలో స్కూల్ విద్యార్థులు ఆర్‌టిసి సిబ్బందితో రహదారి భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ప్రతి రోజు డిపో సిబ్బందికి రహదారి భద్రత గురించి అవగాహన కల్పిస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జగ్రత్తలు గురుంచి వివరించారు. రహదారి భద్రతకు డ్రైవర్స్ పాటించవలసిన నియమాలు పొందుపరిచిన ప్ల కార్డులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజయనగరం ఆర్‌టిసి రీజినల్ సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్ వేణు, ట్రాఫిక్ సూపరింటెండెంట్ వెంకటరావు, సెక్యూరిటీ హెడ్ గార్డ్ రవితేజ స్కూల్ ఉపాధ్యాయులు, ఇతర ట్రాఫిక్ గ్యారేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

శివరామకృష్ణ పేరు చేర్చకపోవడం దారుణం

బొండపల్లి: నియోజకవర్గంలో ఐవిఆర్ఎస్ సర్వే ద్వారా టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి విషయమై మంగళవారం నిర్వహించిన ఐవిఆర్ఎస్ సర్వేలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కరణం శివరామకృష్ణ పేరు చేర్చకపోవడం దారుణమని టిడిపి నాయకులు లెంక చిన్నం నాయుడు, లెంక సత్యనారాయణ, గొర్లె సత్యవతి, కరుమజ్జి కృష్ణ, బొత్స సూర్యనారాయణ, టి.శంకరరావు, కర్రి సత్యనారాయణలు అన్నారు.ఈ సర్వేలో శివరామకృష్ణ పేరు లేకపోవడం వల్ల నియోజకవర్గంలో నాయకులు కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారన్నారు. నియోజకవర్గంలో టిడిపి నాయకులకు, కార్యకర్తలకు కష్టకాలంలో అండగా నిలిచి పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తున్న వ్యక్తి పేరు లేకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా పార్టీ అధిష్టానం పునరాలోచన చేసి ఐవిఆర్ఎస్ సర్వేలో ఆయన పేరును చేర్చాలని కోరారు.

పిచ్చికుక్క స్వైరవిహారం

ప్రజాశక్తి - రేగిడి, రాజాం

రాజాం మండలంలో బొద్దాం, పెనుబాక గ్రామాలలో మంగళవారం పిచ్చి కుక్క స్వైరవిహారం చేసి 10 మందిని గాయపరిచింది. గాయపడిన లక్ష్మి, పెంటమ్మ, రాములమ్మ తదితరులను రాజాం ప్రాంతీయ హాస్పటిల్‌కి తరలించి చికిత్స నిర్వహించారు. పిచ్చికుక్క ఇళ్లల్లోకి ప్రవేశించి చిన్నారులను, వృద్ధుల్ని ఎవరినీ విడిచి పెట్టకుండా గాయపరచడం ప్రజలు భయాందోళనకు గురయ్యారు. తరుచూ పిచ్చి కుక్కలు దాడి చేస్తున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. మున్సిపల్ అధికారులు కుక్కలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

గాయపడ్డ యువకుడు మృతి

ప్రజాశక్తి - జామి

జామి గ్రామానికి చెందిన గొర్లి రాము(24) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. శనివారం విశాఖ జిల్లా తగరపు వలస వద్ద రోడ్డు ప్రమాదం జరగడంతో అక్కడ ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించారు. అక్కడే చికిత్స పొందుతూ మంగళవారం ఉదచం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అప్పలనాయుడు, రమణమ్మలకు రాము రెండో కుమారుడు. విశాఖలో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. పనిపై వెళుతుండగా, రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంన్నట్లు తెలిపారు.

IN THE HON'BLE COURT OF THE ADDL. JUNIOR CIVIL JUDGE AT: VIZIANAGARAM O.S. 463/2021

Between:
Karri Bhaskara Rao & others ...Plaintiffs
And:
Mantena Vijayalakshmi & others ...Defendants

SUMMONS

To,
D-2: Budumuru Jagannadham, S/o. Late Musalayya, Hindu, aged about 62 years, R/at D.No.4-3-69, Ramakoti Bypass Lane, Sultan Bazaar, Hyderabad.
D-3: Madgula Suresh Kumar, S/o. Late Narayana Rao, Hindu, aged about 46 years, R/at Pratap Nagar, Vizianagaram Town & Dist.
D-8: Gedela Ramamohana Rao, S/o. Satyanarayana, Hindu, aged about 70 years, R/at Plot No.202, Sri Venkateswara Nilayam, Port Colony, Nagarapalem Road, Madhurawada, Visakhapatnam.
D-21: Kumili Chettemma, S/o. Narayana, Hindu, aged about 62 years, R/at Kodiganta vari Veedhi, Vizianagaram.

Please take notice that the above-named plaintiffs has instituted the above suit against you and the matter stands posted to **22-02-2024** for your appearance either in person or through a pleader on the above said date at **10:30 A.M.** to answer all material questions failing which the matter will be heard and determined in your absence exparte as per law.

K. PYDITHALLI,
Advocate, Visakhapatnam,
Cell: 8639017738.

IN THE HONOURABLE COURT OF THE JUNIOR CIVIL JUDGE AT GAJAPATINAGARAM O.S.94/2021

Between :
Kolli Ramana Govinda ....Plaintiff
AND:
Gedela Appa Rao & 5 Others .....Defendants
To,
D-3:- Gedela Surya Rao, S/o late Satyam PORAM VILLAGE, Pedamanapuram (S.O.) Mentada Mandal, Vizianagaram District.

Whereas the above named Plaintiff has instituted the above O.S. 94/2021 against you for specific performance with other reliefs. You are hereby summoned to appear in this Court in person or by a pleader, duly instructed and able to answer all material questions relating to the suit who shall be accompanied by some person able to answer all such questions on the **15th Day of FEBRUARY, 2024, at 10-30 A.M.** to answer the claim and further you are hereby directed to file within 30 days of service of summons a written statement of your defence and to produce on the said day all documents in your possession or power upon which you base your defence.

Take Notice that in default of your appearance and to file your written statement within thirty days the suit will be heard and determined in your absence.

By Order of the Honourable Court

I. RAMESH, Advocate,
K.L.Puram, Vizianagaram